క్లుప్తంగా

ఫుడ్ ప్యాకెట్ల పంపిణీ

రాజానగరం: విజయవాడలోని తుపాను బాధితులకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి 2,500 ఫుడ్ ప్యాకెట్లను గురువారం పంపించారు. ఈ వాహనాన్ని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తదితరులు జెండా ఊపి ప్రారంభించారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



సీతానగరం పోలీస్‌స్టేషన్ వద్ద నిందితులు, బైక్, సారాతో పోలీసులు

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ రామచంద్రపురం శివారున సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, పోలీసులకు అందిన సమాచారంతో కోరుకొండ సీఐ సత్యకిషోర్ ఆదేశాల మేరకు ఎస్సై రామ్ కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. రామచంద్రపురానికి చెందిన చిట్టూరి శ్రీనివాసరావు, గెడ్డం చిన్నవెంకటరత్నం మోటార్ బైక్‌పై సారా తరలిస్తుండగా అరెస్టు చేశారు. వారి నుంచి 50 లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా, మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

ఏడుగురు జూదరులపై కేసు

సీతానగరం: చినకొండేపూడి పరిధిలోని పెద కొండేపూడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. పెద కొండేపూడి శివారు మామిడి తోటల్లో పేకాట ఆడుతున్న వీరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.10,200, ఫర్నిచర్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు సీతానగరం, రఘుదేవపురానికి చెందిన వారన్నారు.

మదర్సా నుంచి ఇద్దరి అదృశ్యం



షేక్ సలీమ్(ఫైల్)



షేక్ యాసీన్(ఫైల్)

రాజానగరం: మదర్సా నుంచి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. రాజానగరం సీఐ ఎస్పీ వీరయ్యగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి రూరల్ మండలం, కొంతమూరులో ఉన్న మదర్సాలో మూడేళ్లుగా కిర్లంపూడి మండలం, రామచంద్రాపురానికి చెందిన షేక్ సలీమ్ (17), షేక్ యాసీన్ (14) చదువుకుంటున్నారు. బుధవారం సాయంత్రం మదర్సా నుంచి బయటకు వెళ్లి వారు తిరిగి రాలేదు. వారి తల్లిదండ్రులు, బంధువులు తెలిసిన చోట్ల గాలించి, చివరకు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తును చేపట్టాయి.

రామవరంలో మట్టి విగ్రహాల పంపిణీ

పెదపూడి: మట్టి గణపతిని పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో ఓ ప్రైవేట్ సంస్థ సమకూర్చిన 5 వేల మట్టి గణపతి విగ్రహాలను ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు వాడాలన్నారు.

లంబోదరా.. మొర వినవా..

- చెవిలో చెబితే కోర్కెలు తీర్చే గణపతి స్వామి
- చవితి వేడుకలకు ముస్తాబైన బిక్కవోలు వినాయకుడు
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలి రానున్న భక్తులు
- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



బిక్కవోలు లక్ష్మీగణపతి స్వామి



బిక్కవోలు గణపతి ఆలయ గాలి గోపురం

బిక్కవోలు: చెవిలో చెబితే కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు విశ్వసించే బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి స్వామివారి ఆలయం చవితి వేడుకలకు ముస్తాబైంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ఈ ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. దాదాపు 1100 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయమిది. ఇక్కడ శ్రీలక్ష్మీగణపతి స్వామి ఏకశిలా మూర్తిగా దర్శనమిస్తారు. ఈ విగ్రహం తూర్పు చాళుక్యుల కాలం నాటిదని పురావస్తు శాఖ అంచనా వేసింది. అప్పటి రాజులు ప్రత్యేక పూజలు చేసి, పనులు ప్రారంభిస్తే, అవి అనుకున్నట్టుగా జరిగేవని ప్రతీతి. ఇప్పటికీ అదే సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి వారి చెవిలో భక్తులు తమ కోర్కెలు చెబుతుంటారు. తొమ్మిదో శతాబ్దానికి చెందిన స్వామివారి విగ్రహం కాలక్రమేణా భూస్థాపితమైంది.అనంతరం 19వ శతాబ్దంలో ఈ విగ్రహం పంట పొలాల్లో బహిర్గతమైంది. స్వామి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి భక్తులు చేసిన ప్రయత్నం ఫలించక పోవడంతో, అక్కడే మందిరం నిర్మించి, పూజలు ప్రారంభించారు.

స్వామి వారి ప్రత్యేకతలు

బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి స్వామి విగ్రహం పది అడుగుల పొడవు, ఆరు అడుగుల వెడల్పు ఉంటుంది. భారీ కాయంతో ఉన్న స్వామివారికి తొండం కుడివైపున తిరిగి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. నాగాభరణం, నాగ మొలతాడు, నాగ యజ్ఞోపవీతం, బిళ్లకట్టు పంచెతో సుఖాశీనులైన స్వామివారు భక్తుల కోరికలు తీర్చే దేవుడిగా సుప్రసిద్ధుడు.

చవితి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

వినాయక చవితి సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శనివారం ఉదయం నుంచి గణపతి నవరాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక, శనివారం తెల్లవారుజామున 1.59 గంటలకు తీర్థపు బిందె సేవతో స్వామివారి చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శనివారం ఉదయం 10.29 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు కలశ స్థాపన చేస్తారు. ఈ నెల 16న మహాన్నదానంతో ఉత్సవాలు పూర్తవుతాయి. ఈ తొమ్మిది రోజులు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

> **ఏర్పాట్లు పూర్తి చేశాం**
>
> 
>
> ఈ ఏడాది భక్తులకు ఎండా వాన తగలకుండా, ఆలయం చుట్టూ రేకుల షెడ్లు ఏర్పాటు చేశాం. గతేడాది కంటే ఈసారి వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూల ,ఏర్పాట్లు చేశాం. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చవితి రోజు మినహా, మిగిలిన రోజుల్లో అన్న సమారాధనలు ఏర్పాటు చేశాం.
>
> – ఎ.భాస్కర్, ఈఓ, దేవదాయ శాఖ, బిక్కవోలు గ్రూప్ ఆలయాలు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి నుంచి అవార్డు స్వీకరిస్తున్న విజయలక్ష్మి



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన వేడుకలు



జీజీయూలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న చైతన్యరాజు



మునగాల స్కూల్‌లో సత్కారం అందుకుంటున్న డి.ఉషారాణి

సీతానగరం: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల్లో గురువారం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్‌లో గురు పూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఎం.వీరభద్రరావు ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. పలు అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబును సీతానగరం ఎస్‌బీఐ వారు సత్కరించారు. మండలంలోని చినకొండేపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎస్ ఉషారాణి, పెద వంగలపూడి ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నక్కిన సాయిబాబు, బొబ్బిల్లంక జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు డి.రాజమ్మాయి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. రాజమహేంద్రవరంలో కలెక్టర్ పి.ప్రశాంతి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీఈఓ వాసుదేవరావు చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకున్నారు. వీరిని ఎంఈఓ కె.స్వామినాయక్, సహ ఉపాధ్యాయులు అభినందించారు.

మధురపూడి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మధురపూడికి చెందిన రెడ్డి నాగేశ్వరరావు, గుమ్ములూరు హైస్కూల్ హిందీ పండిట్ హేమంత్‌కుమార్. కాపవరానికి చెందిన కృపావతి, కోటికేశవరానికి చెందిన కె.సత్యనారాయణకు రాజమహేంద్రవరంలో సత్కారం అందుకున్నారు. అలాగే కోరుకొండ మండలంలో ఏడుగురు ఉపాధ్యాయులు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిలో గాదరాడకు చెందిన పుల్లెపు గంగరాజు, గాడాల హైస్కూల్‌కు చెందిన మంగాదేవి, కోరుకొండకు చెందిన చల్లా వెంకటేశ్వరరావు, మునగాలకు చెందిన డి.ఉషారాణి, రాఘవపురానికి చెందిన ఎ.షకీన, శ్రీరంగపట్నానికి చెందిన ఎం.వరలక్ష్మి, రాజవరానికి చెందిన ధనలక్ష్మి ఉన్నారు. కోరుకొండ మండలంలోని మునగాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని డి.ఉషారాణి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. ఆమెను హెచ్ఎం, సహ ఉపాధ్యాయులు సత్కరించారు.

రంగంపేట: మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఎంపికయ్యారు. గోవిందరాజాపురం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని బెల్లపు విజయలక్ష్మి, పాత కోటపాడు యూపీ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు చెవ్వాకుల విజయరత్నం, ముకుందవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు యనమదల బాబూరావు, వడిశలేరు జెడ్పీ హైస్కూల్ నుంచి దాట్ల అరుణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు గురువారం రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి అవార్డు అందుకున్నారు. ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, మధుసూదనరావు, ఉపాధ్యాయులు వీరికి అభినందనలు తెలిపారు.

పెదపూడి: ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని లయన్స్ క్లబ్ జిల్లా 316బీ గవర్నర్ ఈశ్వర్ కుమార్ అన్నారు. జి.మామిడాడ గ్రామంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలలకు చెందిన 8 మంది ఉపాధ్యాయులను ఈశ్వర్‌కుమార్, మంగాదేవి దంపతులు సత్కరించారు. అలాగే జిల్లా ఉప గవర్నర్ చిట్నిడి శ్రీనివాస్, జిల్లా లయన్స్ ప్రతినిధి వినోత్ 100 మంది అనాథలు, వృద్ధులకు భోజన ప్యాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ పీవీ రాజేశ్వరి, ఎంఈఓ సీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి గురువే మార్గనిర్దేశకుడు

రాజానగరం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులను సత్కరించారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో కులపతి కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సమాజానికి మార్గదర్శకుడు గురువేనన్నారు. క్యాంపస్‌లోని ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న గురువులను సత్కరించి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. మండలం నుండి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని హైస్కూల్ ఉపాధ్యాయుడు ఉండుర్తి సుబ్బారావు రాజమహేంద్రవరంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి అవార్డును అందుకున్నారు. అలాగే నామవరంలోని భారతీయ విద్యా భవన్‌లోను ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.





కలెక్టర్ ప్రశాంతి నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్.ఉషారాణి, నక్కిన సాయిబాబు



సుబ్బారావును సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పర్యావరణ హితానికే మట్టి విగ్రహాలు



అనపర్తిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన విగ్రహాలు పూజించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలో కుంచ సత్యనారాయణ(ప్యాచీల శెట్టి), సంధ్యారాణి దంపతులు, శెట్టి కుటుంబం గత పదేళ్లుగా మట్టితో చేసిన విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. సుమారు 1,500 మట్టి విగ్రహాలను ప్రజలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు. వివిధ రకాల రసాయనాలతో చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడంతో జల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పాలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, తడాల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలపై అవగాహన ర్యాలీ

బిక్కవోలు: ప్రకృతి హితుడు మట్టి గణపతి అని పందలపాకలోని శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్ పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి అన్నారు. గురువారం ఆయన విద్యార్థులతో మట్టి గణపతి విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కె.రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డు నాణ్యత పరిశీలన



రాపాక వద్ద సీసీ రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

సీతానగరం: రాజమహేంద్రవరం-సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ జి.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. సీతానగరం-రాజమహేంద్రవరం రోడ్డును జాలిమూడి వద్ద తారు రోడ్డును, ముగ్గళ్ల, బొబ్బిల్లంక, సీతానగరంలోని సిమెంట్ రోడ్లను విజయవాడ నుంచి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, ఎస్ఈ జీవీ భాస్కరరావు, రాజమహేంద్రవరం క్వాలిటీ కంట్రోల్ ఈఈ జి.శ్రీనివాస్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మధుసూదనరావు విలేకరులతో మాట్లాడుతూ, సీతానగరం, రాజమహేంద్రవరం రోడ్డు రూ.104 కోట్ల గాను రూ.40 కోట్ల మేరకు పనులు చేసినట్టు చెప్పారు. రూ.2.50 కోట్ల నిధులతో వేసిన రోడ్డును పరిశీలించినట్టు తెలిపారు. రూ.9 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఆర్అండ్‌బీ ఏఈ వీరన్నబాబు తదితరులు ఉన్నారు.

ఉగ్ర రూపం దాల్చిన గోదావరి వరద



ములకల్లంకలో వరద పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

సీతానగరం: అఖండ గోదావరి వరద మరింత ఉగ్ర రూపం దాల్చుతోంది. గురువారం బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య గోదావరి వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. ప్రకృతి వైపరీత్యాల అదనపు స్పెషల్ ఆఫీసర్ వేదవల్లి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్, ఎస్సై రామ్ కుమార్ బొబ్బిల్లంక రేవు వద్ద గోదావరి వరదను పరిశీలించారు. అక్కడి నుంచి పడవపై ములకల్లంక చేరుకుని, గ్రామంలో పర్యటించారు. వరద మరింత తీవ్రమైతే బొబ్బిల్లంకలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని వారు స్థానికులకు చెప్పారు. ములకల్లంకలో పారిశుధ్యం, తాగునీటి సమస్యపై ఆరా తీశారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని, తాగునీటిని క్లోరినైజేషన్ తప్పనిసరిగా చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ములకల్లంక, బొబ్బిల్లంకల్లో 24 గంటలు వైద్యశిబిరం ఉండాలని, కుక్క, పాము కాటు వ్యాక్సిన్లు, ఇతర మందులపై ఆరాతీశారు. అనంతరం అధికారులు విలేకరులతో మాట్లాడుతూ, ములకల్లంక వాసులను అక్కడి నుంచి తరలించడానికి ప్రయత్నించినా, వారు అంగీకరించడం లేదన్నారు. వరద మరింత ఉద్రిక్తమైతే వారిని తరలిస్తామన్నారు. ఎప్పటికప్పుడు వరద సమాచారం అందుకుని, చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తాగుబోతుతో వేగలేకపోతున్నాం..

పోలీసులను ఆశ్రయించిన సచివాలయ మహిళా సిబ్బంది



ఫిర్యాదు చేసేందుకు రాజానగరం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళా ఉద్యోగులు

రాజానగరం: తప్పతాగి వచ్చి, అసభ్యకరంగా వ్యవహరిస్తున్న తాగుబోతు నుంచి తమకు రక్షణ కల్పించాలని రాజానగరం మండలం నందరాడ గ్రామ సచివాలయ సిబ్బంది వేడుకుంటున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసులకు ఐదుగురు మహిళా ఉద్యోగులతో ఫిర్యాదు చేశామని పంచాయతీ కార్యదర్శి జీఎస్ఎస్ రాణి గురువారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఆ వివరాలు ఇలా.. నందరాడకు చెందిన గురుజారపు సత్యనారాయణ తరచూ గ్రామ సచివాలయంలోకి రావడం, తప్ప తాగి, పిచ్చివాడిలా ప్రవర్తిస్తూ, కారణం లేకుండానే ఉద్యోగులను బండబూతులు తిట్టడం, అదేమిటంటే నరుకుతానంటూ గొడ్డలి చూపించడంతో మహిళా ఉద్యోగులు భయపడిపోతున్నారు. మూడు నెలల కిందట ఇలాగే వ్యవహరిస్తే 112కి ఫోన్ చేస్తే, నెల రోజుల పాటు కనిపించలేదు. ఇప్పుడు తిరిగి గ్రామ సచివాలయానికి వచ్చి, తమనే కాకుండా వీఆర్వోనైతే చెప్పుకోలేని విధంగా దుర్భాషలాడుతున్నాడని ఆ ఉద్యోగినులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అతని కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్తే, మమ్మల్ని కూడా కత్తితో బెదిరిస్తున్నాడని, పోలీస్ స్టేషన్‌కు వచ్చి అతనిపై తామూ ఫిర్యాదు చేస్తామంటున్నారని అన్నారు. ఇక గ్రామస్తులు కూడా అతని ప్రవర్తనతో భయపడిపోతున్నారని నందరాడ గ్రామ సచివాలయ ఉద్యోగులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో గ్రామంలో ముఖ్యంగా సచివాలయం వద్ద ప్రశాంత పరిస్థితులు లేకుంటే ఉద్యోగాలు చేయలేమని, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వారు వేడుకున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతానగరం: మండలంలోని కొన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు. 11కేవీ చినకొండేపూడి ఫీడర్‌లో మరమ్మతులు, ట్రీ కటింగ్ కోసం సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. చినకొండేపూడి, సింగవరం నాగరత్నకాలనీ, సీతానగరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.